**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

విజయవాడ,

తేది : 16 ఆగష్టు, 2020.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
వెలగపూడి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : విద్యా సంవత్సర పరిరక్షణ కోసం ప్రత్యామ్నాయ విద్యా ప్రణాళిక నిమిత్తం...**

**ఆర్యా!**

రాష్ట్రంలో రోజురోజుకీ కరోనా వ్యాధి విజృంభిస్తోంది. కేసులు, మరణాల సంఖ్య పెరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యాపిస్తున్నాయి. ఈ స్థితిలో విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతినివ్వాలి. ప్రభుత్వం భావిస్తున్నట్లుగా సెప్టెంబర్ లో స్కూళ్లు తెరవడం అంత శ్రేయస్కరం కాదని మేము భావిస్తున్నాం. అందువల్ల కనీసం రానున్న మూడు మాసాలకు ప్రత్యామ్నాయ విద్యా ప్రణాళికను ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో పాటు అనుభవజ్ఞులైన విద్యావేత్తలు, శాసనమండలి సభ్యులతో సంప్రదించి ప్రకటించాలని కోరుతున్నాము. ఇలాంటి ప్రణాళికకు "సమాన అవకాశాలు, సమాన విద్య" అన్న సూత్రం ప్రాతిపదికగా ఉండాలి. తద్వారా విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూడాలి. మారుమూల వెనుకబడిన ప్రాంతాల్లో నివసించేవారితో సహా పేద విద్యార్థులు ఎవరూ విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలి. అందుకోసం సిపిఐ(యం) తరపున మేము ఈ కింది ప్రతిపాదనలను మీ ముందుంచుతున్నాము. పరిశీలించి తగిన చర్యలు తీసుకోగలరని కోరుతున్నాము.

**(1)** ప్రత్యక్షంగా పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడే వరకు ఆన్ లైన్ క్లాసులు జరపాలి. అయితే మన రాష్ట్రంలో నెట్ వర్కు విస్తృతి తక్కువగా ఉంది. అంతే కాదు ల్యాప్ టాపులు లేదా కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు లాంటి సాధనాలు ఉన్నవారు 50 శాతం లోపే. కాబట్టి ఆన్ లైను క్లాసుల కారణంగా విద్యార్థుల మధ్య విభజన రాకుండా చూడాలి. ఆ రీత్యా ప్రతి ఒక్క విద్యార్థికి ట్యాబ్, ఇంటర్ నెట్ సౌకర్యం ప్రభుత్వమే కల్పించాలి.

**(2)** నెట్ వర్కు సౌకర్యం లేని చోట టివి ద్వారా విద్యను అందించాలి. ప్రస్తుతం ఉన్న దూరదర్శన్ ఛానల్ ద్వారా ఆ కొరత తీరదు. కేరళ తరహాలో రాష్ట్ర ప్రభుత్వమే తాత్కాలికంగా కొన్ని ఛానళ్లు ప్రారంభించాలి. టీవీలు లేని చోట సామూహికంగా చూసేందుకు మొబైల్ వాహనాల ద్వారా అందుబాటులోకి తేవాలి.

**(3)** టీవీల ద్వారా అందించే విద్యలో టీచర్ విద్యార్థికి మధ్య అనుబంధం ఉండదు. ఈ లోటును పూడ్చడానికి క్లాస్ టీచర్ ద్వారా పర్యవేక్షణ చేయాలి. ఫోను లేదా వాట్సప్ వంటి సాధనాల ద్వారా పర్యవేక్షణతోపాటు వివరణలు, సలహాలు ఇవ్వాలి అనుమానాలు నివృత్తి చేయాలి. ప్రతి టీచరుకు 15 లేదా 20 మంది విద్యార్థులతో ఈ ఫాలోఅప్ ఉండాలి. పిల్లల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. అభ్యసనాన్ని అంచనా వేసి ప్రగతి రిపోర్టులు రూపొందించాలి. తద్వారా విద్యార్థి అవగాహనా శక్తి పెరుగుతుంది.

**(4)** ఉపాధ్యాయులు విద్యార్థులతో సంబంధాలు పెట్టుకోడానికి, ఆన్ లైను పాఠాలు చెప్పడానికి సబ్సిడీపై లాప్ ట్యాప్ లేదా స్మార్టు ఫోను ఇవ్వాలి. స్కూళ్లలో కనీసం రెండు లేదా మూడు రూముల్లోనైనా నెట్‌తో అనుసంధానం చేయాలి.

**(5)** స్కూళ్లు తెరిచేంతవరకు మధ్యాహ్న భోజనం డ్రై రేషను ఇంటికే అందించాలి. అలాగే స్కాలరుషిప్పును కూడా అందించాలి. తద్వారా ఆర్థిక ఇబ్బందుల నుండి తల్లిదండ్రుల ఒత్తిడి పిల్లలపై పడకుండా ఉంటుంది.

**"త్రిప్పి చూడగలరు"**

**(6)** వర్కు బుక్సుతో పాటు టెక్స్టుబుక్కు, నోట్సులు, ఇతర మెటీరియల్ కిట్ రూపంలో విద్యార్థుల ఇంటికే అందించాలి.

**(7)** మారిన పరిస్థితుల్లో అకడమిక్ సంవత్సరాన్ని కుదించాలి. దానికనుగుణంగా సిలబస్‌ను తగ్గించాలి. ఇందుకోసం నిపుణులతో ఒక ప్రత్యేక కమిటీ వేయాలి.

**(8)** నాన్ కంటైన్ మెంటు జోన్లలో అవకాశం ఉన్న చోట పూర్తిగా లేదా పాక్షికంగా విద్యాలయాలను భౌతికంగా ప్రారంభించాలి. అయితే షిఫ్టు సిస్టంలో ఇవి సాగాలి. అందుకవసరమైన అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయుల్ని రిక్రూట్ చేసుకోవాలి.

**(9)** కరోనా ఉధృతి తగ్గేకొద్దీ పూర్తి స్థాయిలో విద్యాలయాలను దశలవారీ ప్రారంభించాలి. ఒక గదిలో ఇప్పుడున్న సంఖ్య కన్నా తక్కువ మంది విద్యార్థులుండేట్లు చూడాలి. అందుకు తరగతి గదులు అదనంగా నిర్మించాలి.

**(10)** గురుకుల విద్యాలయాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీ హాస్టళ్లలో అదనపు వసతి కల్పించాలి. తద్వారా ఒకే చోట ఎక్కువ మంది ఉండకుండా నిరోధించాలి. అవసరమైతే తాత్కాలికంగా అద్దె భవనాలను ఉపయోగించుకోవచ్చు.

**(11)** విద్యాలయాలు ప్రారంభించడానికి ముందు అక్కడ ఆరోగ్య వసతులు పెంచాలి. కరోనా నుండి రక్షణకు అవసరమైన మాస్కులు, శానిటైజర్లు పెట్టాలి. విద్యార్థులు గుమికూడకుండా గార్డులను నియమించాలి.

**(12)** ఉపాధ్యాయుల ప్రత్యక్ష సహకారం తక్కువగా ఉండే ఈ సమయంలో ఆంగ్ల మాధ్యమానికే పరిమితమైతే అది విద్యార్థుల పాలిట శాపమవుతుంది. కావున వారు ఏ మీడియంలో చదువుతున్నప్పటికీ ఆన్ లైను లేదా టివీ పాఠాలను తెలుగులో కూడా వివరించాలి. రెండు మీడియంలలోనూ పాఠాలు వినే ఏర్పాటు చేయాలి.

**(13)** ప్రైవేటు విద్యాలయాలు ఎన్‌సీ ఈ ఆర్టీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. ఫీజులపై నియంత్రణ ఉండాలి. ఆన్ లైను పాఠాలన్నీ ఎన్‌సీ ఈ ఆర్టీ మార్గదర్శకాలకు లోబడి ఉండాలి.

**(14)** ప్రభుత్వ విద్యాలయాల్లో అడ్మిషన్లు అందరికీ అందుబాటులోకి తేవాలి. ఏ తరగతిలో చేరాలన్నా అవకాశం కల్పించాలి. ట్రాన్స్ఫర్లు ఆమోదించి అడ్మిషన్ చేసుకోవాలి. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలకు వారు కోరుకున్న చోట అడ్మిషన్ సౌకర్యం కల్పించాలి.

**(15)** నివాసిత ప్రాంతాల్లో సచివాలయంలో విద్య ఇన్ చార్జి, వలంటీర్ల సహకారంతో స్థానిక విద్యార్థులను గుర్తించి వారిని టీచర్లతో అనుసంధానం చేయాలి. పాఠాలు వినేందుకు వారు ఫెసిలిటేటర్లగా వ్యవహరించాలి.

**అయ్యా,**

విద్యా సంవత్సరం నష్ట పోయామనిగానీ, బడులు మూసేశారన్న భావన కానీ రాకుండా చూడాలి. పాఠశాల సమయంలో స్కూళ్లు తెరిచి ఉంచాలి. తల్లిదండ్రులు లేదా పిల్లలు ఏ సమాచారం కావాలన్నా అందుబాటులో ఉండాలి. కేరళ తరహాలో నూటికి నూరు శాతం పిల్లలకు విద్యను వివిధ రూపాల్లో అందుబాటులోకి తేవాలి. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలు, దళిత, గిరిజన ఆవాసిత ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురి కాకుండా చూడాలి. ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా బోధనకు ప్రత్యేక ప్రణాళిక ఉండాలి.

కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు అందరికీ సమానంగా విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

అభివందనములతో...

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి